ఎద్దుకి అలవాటన్న మాట అనుకున్నాడు. అలా అనుకోగానే గబుక్కుని నారాయుడు పాడేపాటలు గుర్తొచ్చాయి చంటికి.

చాలాదూరం అలాగే బండితో పాటే నడిచాడు. కాళ్ళు లాగుతున్నా పొద్దు ఉండగానే గూడు చేరుతున్నందుకు హుషారొచ్చింది చంటికి. కాని నారాయుడు ఆ సందులోకి తిరిగేటప్పటికి ఆ హుషారు చచ్చిపోయింది.

బయట హడావుడికి ఇంట్లోంచి ఎవరో ఇద్దరుకుర్రాళ్ళొచ్చారు. వాళ్ళనిచూపి బలవంతంగా ఒంటిని కదిపాడు చంటి. కాస్సేపటికి ఎవరో పెద్దాళ్ళు వచ్చారు. చంటి గజ్జెలతో అలా గంతులేస్తుంటే చిన్న పిల్లలు పగలబడి నవ్వారు. వాళ్ళని చూసి పెద్దాళ్ళూ నవ్వారు.

తన ఈడు పిల్లలు తన ఆటని చూసి నవ్వుతుంటే మొదట్లో చెడ్డఉక్రోషంగా ఉండేది చంటికి. అలా ఆడుతుండగానే పన్నెండేళ్ళ వాడి మనసులో ఎన్నో ఆలోచన లొచ్చేవి.

తనలాంటి పిల్లలేగా వాళ్ళూను. తనను చూసి ఎందుకు నవ్వాలి. తనొక్కడే రోడ్ల మీద ఇలా డాన్సెందుకు చెయ్యాలి? వాళ్లెందుకు చెయ్యరు. తనకి అమ్మా, నాన్నా లేనందుకేనా....

ఇలాంటి ఆలోచనలకి ఆడుక్కుతినేవాళ్ళలో చాలామంది చెప్పుకునే సమాధానమే తన మనసుకి చంటీ చెప్పుకునేవాడు.—'అదివాళ్ల అదృష్టం...,వాళ్ళు చేసుకున్న పుణ్యం' అని.

నెమ్మదిగా అందరి నవ్వులూ, అన్నిరకాల మాటలూ, ఎవరేనా తనని చూసి నవ్వితే వాళ్లతోబాటు తనూ బలవంతంగా నవ్వటం.... ఇలాంటి వెన్నెన్నో అలవా టయ్యాయి చంటికి.

సందంతా తిరిగేటప్పటికి అరగంట పట్టింది. ముప్పై పైస లొచ్చాయి. మొదట ఆడిన ఇంటివాళ్ళు రెండుపైస లిచ్చారు. మరో యింటివాళ్ళు మూడుపైస లిచ్చారు. ఎవరో స్టూడెంట్సు రూముదగ్గిర ఆడితే పావలా ఇచ్చారు, ఇస్తూ ఇస్తూ, "ఈ కుర్రాడెందుకు? ఎవత్తేనా పిట్టని చూడకపోయావా" అన్నారు నారాయుడితో.

నవ్వి వూరుకున్నాడు నారాయుడు.

ఇంక ఎండ పోతూందనగా బస్స్టాండ్ దగ్గిర కొచ్చారు నారా

